క్లుప్తంగా

ఆరోగ్య ఉప కేంద్రం కోసం స్థల పరిశీలన



రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో నిర్మించబోయే ఆరోగ్య ఉప కేంద్రం కోసం మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో స్థల పరిశీలన చేశారు. గతంలో రైతు వేదిక వద్ద ఉన్న స్థలాన్ని గుర్తించగా, అక్కడ ఫంక్షన్ హాల్ నిర్మించాలని అనుకుంటున్నట్టు పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గ్రామస్తులు సమిష్టిగా చర్చించుకుని ఆరోగ్య ఉప కేంద్రం కోసం స్థలాన్ని చూపించాలని సూచించారు. తహసీల్దార్ గంగాధర్, జీపీ కార్యదర్శి జగదీష్, మాజీ జెడ్పీటీసీ పుప్పాల శంకర్, రెవెన్యూ, జీపీ సిబ్బంది ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో నూతన జీపీ భవన నిర్మాణం కోసం మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలు భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, , దేవరాజ్, గంగారెడ్డి, చిన్నారెడ్డి, దేవగౌడ్, రాజేశ్వర్, పీఆర్ఏఈ షరీఫ్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో జాతీయ రహదారి 44 నుంచి ప్రాజెక్ట్ వరకు గల రోడ్డు మధ్య డివైడర్‌పై పిచ్చి మొక్కలను స్థానికులు తొలగించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు. సెంట్రల్ లైటింగ్ రావడం లేదని సంబంధిత అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డివైడర్‌లో నాటిన కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

రుద్రూర్ టీజీబీ మేనేజర్‌గా శ్రీవిద్య బాధ్యతల స్వీకరణ




రుద్రూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా శ్రీవిద్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించిన సంపత్ కుమార్ పదోన్నతిపై సిద్దిపేట్ రీజినల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీవిద్య బదిలీపై రుద్రూర్ టీజీబీ బ్యాంకు వచ్చారు.

పశువైద్యశిబిరం తనిఖీ



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో మండల పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్ పాండే, ఉమా సహేర్‌ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పశువైద్యశిబిరాన్ని మంగళవారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి తనిఖీ చేశారు. పశువైద్యసిబ్బంది గొర్రె, మేకలకు అందిస్తున్న పీపీఆర్ టీకాలు వేస్తున్న తీరును పరిశీలించారు.గొర్రె, మేకలకు అందిస్తున్న వైద్యంపై జిల్లా పశువైద్యాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ కళ్యాణి, అహ్మద్‌పాషా, శ్యామల, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఏళ్లుగా ఇళ్లు లేక ఎదురు చూస్తున్న తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు భగవాన్‌దాస్, సురేష్, రాజేశ్వర్, రాజేందర్, రవికాంత్, శంకర్, గంగాధర్, ప్రభాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చేది ఎప్పుడో?

- ఆర్మూర్‌లో ప్రారంభానికి నోచుకోని ఇండోర్ స్టేడియం, పెవిలియన్
- అదనపు నిధులు మంజూరు కాకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్
- క్రీడాసామగ్రి ఏర్పాటు చేయడంలో జాప్యం



ఆర్మూర్ పట్టణంలోని జావిద్ బాయ్ మినీ స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం



ఆర్మూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్మించిన పెవిలియన్

ఆర్మూర్: పట్టణంలోని జావిద్‌బాయ్ మినీస్టేడియంలో అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయడంలో జాప్యం కారణంగా క్రీడాకారులకు స్టేడియం అందుబాటులోకి రావడం లేదు. రూ. కోటితో చేపట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగంగా మారుతున్నాయని క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్రీడాకారుల విజ్ఞప్తుల మేరకు మినీ స్టేడియం అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి 50 లక్షలు మంజూరు చేయగా 2017 ఫిబ్రవరి 1న శంకుస్థాపన చేశారు. అధికారులు స్టేడియం పనులను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించడంలో ఏడాదిన్నర జాప్యం జరిగింది. అనంతరం కాంట్రాక్టర్ రూ.కోటి మూడు లక్షలతో పనులను ప్రారంభించారు. స్టేడియం అభివృద్ధి పనుల్లో భాగంగా ఇండోర్ స్టేడియం, పెవిలియన్ నిర్మాణాలు పూర్తయ్యాయి. నిర్మాణాలు పూర్తయిన అనంతరం క్రీడాకారులకు అవసరమైన పరికరాలను సైతం సమకూర్చవలసి ఉంది. అదనంగా రూ.20 లక్షలు మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులను కాంట్రాక్టర్ కోరాడు. ఈ నిధులు ఇప్పటివరకు మంజూరు కాలేవు. దీంతో పరికరాల ఏర్పాటు విషయంలో ఆలస్యం జరుగుతుండటంతో ఇండోర్ స్టేడియం, పెవిలియన్ ప్రారంభానికి నోచుకోవడం లేదు.

అందుబాటులోకి తేవాలి

మినీ స్టేడియంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. సంబంధిత అధికారులు ఇండోర్ స్టేడియం,పెవిలియన్‌ను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– జీవీ నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్, ఆర్మూర్

‘స్వచ్ఛ ఆర్మూర్’కు సహకరించాలి



పాతబస్టాండ్ వద్ద స్వచ్ఛత ర్యాలీలో భాగంగా మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యచరణ ప్రణాళిక మంగళవారంతో ముగిసింది. ఈసందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. ఈసందర్భంగా కమిషనర్ రాజు మాట్లాడుతూ.. పుర ప్రజలు ‘స్వచ్ఛ ఆర్మూర్’కు సహకరించాలన్నారు. చెత్తను రోడ్లపై, ఇంటి ముందు వేయొద్దని, చెత్త సేకరించే వాహనాలకు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్వో ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్‌లు దత్తారెడ్డి, పూర్ణమాళి, సురేష్, వార్డు అధికారులు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



రుద్రూర్: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. మంగళవారం ఆయన కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో ఆయన పర్యటించారు. మాంసం విక్రయించే దుకాణాలు అపరిశుభ్రంగా ఉంటే దుకాణాలు మూసి వేస్తామని హెచ్చరించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు వచ్చే రాబడులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో ప్రతి షాపు, ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలో సాధించాలన్నారు. సిబ్బంది బీమా సకాలంలో చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవోలు శ్రీనివాస్ రెడ్డి, చందర్, ఎంపీవోలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండోరోజు ఎన్ఎస్ఎస్ శిబిరం



వైద్య శిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మాక్లూర్: మండలంలోని ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాలలో మంగళవారం నిజామాబాద్ ఉమెన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రెండోరోజు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అమ్రాద్‌లో జరిగిన వైద్య శిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు ముత్యంపల్లి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వీధులను శుభ్రం చేశారు. అనంతరం అమ్రాద్ గ్రామంలో నిజామాబాద్‌కు చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం యునిట్ 1,2, అధికారులు కె మాధవి, ఆర్ మమత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కేసీఆర్ కాలనీలో తీరిన సమస్యలు



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో కే సీఆర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య, రహదారిలో వీధి దీపాల ఏర్పాటు సమస్యలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చొరవతో పరిష్కారానికి నోచుకున్నాయి. కాలనీలో చాలా రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, గ్రామం నుంచి కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు వెలుగక చిమ్మ చీకట్లో భయంగా వెళ్తున్నామని ఆదివారం పడగల్‌లో పరామర్శకు వెళ్లిన ప్రశాంత్‌రెడ్డికి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన మిషన్ భగీరథ అధికారులకు, జీపీ సిబ్బందికి అక్కడి నుండి ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



దూపల్లిలో హైస్కూల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామకమిటీ సభ్యులు



రుద్రూర్‌లో..

రెంజల్/రుద్రూర్ : రెంజల్ మండలం దూపల్లి హైస్కూల్‌లో మీకోసం మేము స్వచ్ఛంద సేవా సంస్థతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక, హైస్కూల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హైస్కూల్‌కు చెందిన రాజేశ్వర్, సాయన్నలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవడంతో పాఠశాల హెచ్‌ఎం మాధవరెడ్డి వారిని సన్మానించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, మీకోసం మేము సంస్థ వ్యవస్థాపకుడు రఘుపతి లక్ష్మణ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, వీడీసీ చైర్మెన్ బాబన్న, మాజీ చైర్మన్ లింగంయాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రుద్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్‌లోని తమలో గత 15 నుంచి 30 ఏళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న పది మంది టీచర్లను ఘనంగా సన్మానించారు. లోగం నాగరాజు, మహజన్ నర్సింలు, సునీత జలోజి, కర్రోల్ల కృష్ణ ప్రసాద్, వాసవి, సరస్వతి, సాయిలీల, భవాని, గాయత్రి, సునీత హన్మాండ్లు సన్మానం పొందారు.

ఆలయంలో సీపీ పూజలు

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో గల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని మంగళవారం నిజామాబాద్ సీపీ సాయి చైతన్య సందర్శించి దర్శనం చేసుకున్నారు. ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, సిబ్బంది ఉన్నారు.

కాళోజీకి ఘన నివాళి

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాళోజీ కృషిని కొనియాడుతూ విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు.

– సాక్షి, నెట్ వర్క్



కొటార్మూర్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ..



నందిపేట మండలం అయిలాపూర్ కళాశాలలో..



రుద్రూర్ ఆహార శాస్త్ర విజ్ఞాన కళాశాలలో కాళోజీ నారాయణ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో..



వన్నెల్(బి) విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది



ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం రామ్‌ప్రసాద్



అవార్డు అందుకుంటున్న టీచర్ సాయిలు

డొంకేశ్వర్/కమ్మర్‌పల్లి/బోధన్‌రూరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్ తెలుగు పండితులు టేకుర్ల సాయిలు అన్నారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చౌడారపు రామ్‌ప్రసాద్, బోధన్‌రూరల్ మండలం బర్దీపూర్ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యయుడు వెంకటేశ్వర్లు అవార్డు అందుకున్నారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి, కలెక్టర్ టి. వినయకృష్ణారెడ్డి చేతుల మీదుగా వీరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు.రామ్‌ప్రసాద్ కోనాపూర్ పాఠశాలకు గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చిన రెండేళ్ల వ్యవధిలో పాఠశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 150 ఆర్టికల్స్‌తో పాఠశాలలో గణిత ప్రయోగశాల ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు గణిత స్టడీ మెటీరియల్ పంపిణీ, సూత్రాల కార్డుల పంపిణీ, సూత్రాల ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. రెండేళ్లుగా గణిత సెమినార్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపి కవుతున్నారు.రూ. 1.20 లక్షల వ్యయంతో పాఠశాలలో వాటర్ ఫిల్టర్, కూలర్లను వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్‌తో ఏర్పాటు చేయించారు.



అవార్డు అందుకుంటున్న టీచర్ వెంకటేశ్వర్లు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



గుత్పలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నందిపేటలో ..

మాక్లూర్/నందిపేట్ : మండలంలోని గుత్ప, రాంచంద్రాపల్లి గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. గుత్ప గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులకు కలిపి రూ.1,20,000 రాంచందర్‌పల్లిలో బాధితురాలికి రూ.34,000 చెక్కులను అందించారు. కాంగ్రెస్ నాయకులు శశికుమార్, జితేందర్, పోశెట్టి, రాజేష్, సురేష్, స్వామి, సంతోష్, గంగాధర్, సుక్కి ప్రభాకర్, గున్నం గంగారాం, భూపతి పాల్గొన్నారు. నందిపేటకు చెందిన ముగ్గురు బాధితులకు కలిపి మంజూరైన రూ. 1,49,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ అందజేశారు. నాయకులు యూసుఫ్, కాంతం, చిన్నయ్య, ఎడ్డిగారి నిఖిల్, మన్నె సాగర్, తమ్మల్ల దేవేందర్, అమర్, అబ్దుల్, సమద్, విలాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్లను అందజేశారు. ఇద్దరు విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు ప్రతి రోజు కాలినడకన రావడం గమనించి వారికి సైకిల్ అందించినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉండాలి

పెర్కిట్(ఆర్మూర్): పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడే విధంగా కృషి చేయాలని ఎంఈవో రాజా గంగారాం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్, మండలంలోని పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమంపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. హెచ్‌ఎంలు సిరిల్ రావు, నవీన్, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో షీ టీం అవగాహన

బాల్కొండ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు షీటీం కానిస్టేబుళ్లు సుమతి, విఘ్నేష్‌లు సూచించారు. మండలంలోని కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సమస్యలు ఉన్నా వెంటనే షీ టీంకు ఫిర్యాదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య,వైద్యం పేదలకు అందని ద్రాక్ష



బోధన్: విద్య, వైద్యం పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందని ద్రాక్షగా మారిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో అమరుడు మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవంలో భాగంగా ఉచిత విద్య, వైద్యం– ప్రభుత్వరంగంలో కొనసాగించాలి అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపోరాటాలతోనే ప్రభుత్వ విద్య,వైద్య రంగాలను రక్షణకు మార్గమని పేర్కొన్నారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర బాలికల కన్వీనర్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శివకుమార్, జిల్లా కన్వీనర్ ఎండీ మోసిన్,నాయకులు సాయికుమార్, రాములు, సంగీత, నాగేంద్ర, శశాంక్,దుర్గా, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: వారానికి రెండు రోజులు అందించే ఉచిత ఫిజియోథెరపీ శిక్షణ సేవలను వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఇన్ క్లూసివ్ ఎడ్యుకేషన్‌రిసోర్స్ పర్సన్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి గంగామణి తెలిపారు. పాఠశాలకు చెందిన బీ గౌరి అండర్–17 బేస్ బాల్ పోటీల్లో బంగారుపతకం, బీ శరణ్య అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో రజత పతకం, జీ ఉషస్వినీ అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థినులను, పీఈటీ వీణను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

సమస్యలపై సీపీఎం సర్వే

నవీపేట : మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట కాలనీలో సమస్యలపై సీపీఎం నాయకులు మంగళవారం సర్వే చేశారు. కాలనీలో మురుగుదొడ్లు, మురికి కాలువలు, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. నాయకులు నాయక వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, మహబూబ్ తదితరులున్నారు.

నేడు ఉషోదయలో క్యాంపస్ సెలక్షన్

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో టాస్క్ సౌజన్యంతో బుధవారం క్యాంపస్ సెలక్షన్ నిర్వహించబడుతుందని కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన చేశారు. ఈ క్యాంపస్ సెలక్షన్‌లో టెలీ ఫెర్ఫామెన్స్ కంపెనీలో కస్టమర్ సర్వీస్ అసోసియేట్, కన్సల్‌టెంట్. మాడరేటర్, ఎనలిస్ట్ కు సెలక్షన్‌లు జరుగుతాయన్నారు. ఈ క్యాంపస్ సెలక్షన్‌లో 2024–25 సంవత్సరాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీ.బీ.ఏ, బీ.బీ.ఎం, బీఈ, బీ.టెక్ విద్యార్థులు అర్హులని తెలిపారు.

ఫ్రీజర్ వితరణ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం వెల్మల్ గ్రామంలో మంగళవారం స్థానికులైన రామకృష్ణ, ఇస్సపల్లి నరేందర్‌లు ఫ్రీజర్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ హాజరై మాట్లాడారు.

నిజామియా పాఠశాలలో ఖురాన్ల పంపిణీ

బోధన్‌టౌన్(బోధన్): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని రెంజల్ బేస్‌లోగల నిజామియా పాఠశాలలో అబ్దుల్ ఖాదర్ సొసైటీ ఆధ్వర్యంలో ఖురాన్, బుర్ఖాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్ద ఖాజా నాజుద్దీన్ సుల్తాన్ ఖాద్రి హైజర్ మాట్లాడారు. అబ్దుల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సనా పటేల్, పాఠశాల కరస్పాండెంట్ మాజిదొద్దీన్, అతిక్ తదితరులున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు స్థానిక ఎస్సైలు అందజేశారు. రుద్రూర్‌కు చెందిన ఉప్పు గంగాధర్, పోతంగల్ మండలం కల్లూర్‌కు చెందిన మేత్రి దేవుగొండల మొబైల్ ఫోన్లు పోవడంతో పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి పోలీస్‌స్టేషన్‌లకు పిలిపించి బాధితులకు అందజేసినట్టు ఎస్సైలు సాయన్న, సునీల్ వెల్లడించారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



బోధన్ టౌన్ (బోధన్) : పట్టణంలో బోధన్ మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షులు గణేష్, కార్యదర్శి అనిల్ రెడ్డి, సహాయ కార్యదర్శులు గా శ్రీకాంత్, భాస్కర్, శ్యామ్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లో ఈనెల 19,20,21 తేదీలలో నిర్వహించే ఫొటో ఎక్స్ పో పోస్టర్లను ఆవిష్కరించారు.